
2 లో

## డీసీసీ అధ్యక్షుడి నియామకంపై కాంగ్రెస్ శ్రేణుల సంబరాలు




# సంగారెడ్డి మెదక్

మంగళవారం 22 సెప్టెంబర్ 2026 www. praja jyothi news.com పేజీలు:09


# పేదల సొంతింటి కలను సాకారం చేయడమే ప్రభుత్వ లక్ష్యం

## - ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి

**నారాయణఖేడ్, సెప్టెంబర్ 21, ప్రజాజ్యోతి:**

పేదల సొంతింటి కలను సాకారం చేయడమే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ లక్ష్యమని నారాయణఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి అన్నారు. నిజాంపేట్ మండల పరిధిలోని ర్యాలమడుగు గ్రామానికి చెందిన దొంతిగారి సుజాత, మల్లేష్







దంపతులకు ప్రభుత్వం మంజూరు చేసిన ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి, నారాయణఖేడ్ మున్సిపల్ చైర్మన్ నగేష్ కుమార్ షెట్కార్ పాల్గొని నూతన గృహాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అర్హులైన ప్రతి కుటుంబానికి దశలవారీగా ఇందిరమ్మ ఇళ్లను అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. సొంత ఇల్లు సమకూరడంతో సుజాత, మల్లేష్ కుటుంబంలో ఆనందం వెల్లివిరిసిందని, వారి కొత్త జీవితం సుఖసంతోషాలతో సాగాలని ఆకాంక్షించారు. మిగతా 2 లో

# కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు రెండూ దొంగలే

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు వాల్దాస్ రాధా మల్లేష్ గౌడ్
- నర్సాపూర్ అసెంబ్లీ కార్యాలయంలో బీజేపీ విలేకరుల సమావేశం
- మెదక్, నర్సాపూర్ నియోజకవర్గాలకు తీరని అన్యాయం చేసిన కేసీఆర్, హరీష్ రావు
- ప్రజల దృష్టి మరల్చేందుకే నాటకాలాడుతున్నారని ఆగ్రహం







**మెదక్ (ప్రజాజ్యోతి)**

కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు రెండూ దొంగలేనని, ప్రజలను మోసం చేయడంలో పోటీ పడుతున్నాయని బీజేపీ మెదక్ జిల్లా అధ్యక్షుడు వాల్దాస్ రాధా మల్లేష్ గౌడ్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు సోమవారం నర్సాపూర్ అసెంబ్లీ నియోజకవర్గ బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రెస్ మీట్‌లో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా మల్లేష్ గౌడ్ మాట్లాడుతూ.. ప్రజాప్రతినిధులై ఉండి కూడా బుల్లెట్ ప్రూఫ్ ఏసీ బస్సుల్లో ఫామ్‌హౌస్ గేట్ల వద్దకు వెళ్లి కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు చేస్తున్న దిగజారుడు రాజకీయాలను ప్రజలు అసహ్యించుకుంటున్నారన్నారు. మిగతా 2 లో

# కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు రెండూ దొంగలే

మొదటిపేజీ తరువాయి

"నువ్వు కొట్టినట్లు చెయ్.. నేను ఏడ్చినట్లు చేస్తా" అనే రీతిలో ఇరు పార్టీల నాయకులు నాటకాలాడుతున్నారని ఎద్దేవా చేశారు. వీరి డ్రామాలను బీజేపీ మెదక్ జిల్లా శాఖ తరపున తీవ్రంగా ఖండిస్తున్నామని, కాంగ్రెస్, బీఆర్ఎస్ ఇప్పటికైనా కళ్ళు తెరవాలని హితవు పలికారు. ప్రజలు వీటన్నింటినీ గమనిస్తున్నారని, తగిన సమయంలో గుణపాఠం చెబుతారని హెచ్చరించారు.



## జిల్లాలకు తీరని అన్యాయం




మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రి హరీష్ రావులు మెదక్ జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులుగా ఉండి కూడా మెదక్, నర్సాపూర్ నియోజకవర్గాలకు తీరని అన్యాయం చేశారని మల్లేష్ గౌడ్ ఆరోపించారు. కనీస అభివృద్ధిని పట్టించుకోకుండా స్వార్థ రాజకీయాలు చేశారని మండిపడ్డారు. ఈ విలేకరుల సమావేశంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి సంగసని సురేష్, మాజీ ఓబీసీ మోర్చా రాష్ట్ర నాయకుడు రమేష్ గౌడ్, జిల్లా ఉపాధ్యక్షులు రాజేందర్, నారాయణ రెడ్డి, జిల్లా కోశాధికారి ఆంజనేయులు గౌడ్, జిల్లా కార్యదర్శి అశోక్ సాదుల, మండల అధ్యక్షుడు నీలి నగేష్, రవి, నర్సాపూర్ పట్టణ కన్వీనర్ ప్రేమ్, జిల్లా మోర్చా నాయకులు నగేష్ గౌడ్, నర్సారెడ్డి, పార్టీ నాయకులు షాదుల్లా, నర్సయ్య, చంద్రమోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# పేదల సొంతింటి కలను సాకారం చేయడమే ప్రభుత్వ లక్ష్యం

మొదటిపేజీ తరువాయి







ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా పేద కుటుంబాలకు గౌరవప్రదమైన నివాసం కల్పించడంతో పాటు వారి జీవన ప్రమాణాలను మెరుగుపరిచేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని పేర్కొన్నారు. నియోజకవర్గంలోని అర్హులైన లబ్ధిదారులకు ఇళ్ల మంజూరు, నిర్మాణం, బిల్లుల చెల్లింపు ప్రక్రియలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నిజాంపేట్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు లింగారెడ్డి, నారాయణఖేడ్ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు పండరి రెడ్డి, ర్యాలమడుగు గ్రామ సర్పంచ్ సాయిలు, రాధాకిషన్ సేఠ్, కౌన్సిలర్ సుబుర్, వివేకానంద, మల్లేష్, సాయిలు, వెంకటరాములు, కిష్టయ్య, లక్ష్మయ్య, ఉపసర్పంచ్ నాగయ్య, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# డీసీసీ అధ్యక్షుడి నియామకంపై కాంగ్రెస్ శ్రేణుల సంబరాలు

మొదటిపేజీ తరువాయి



**కల్హేర్, సెప్టెంబర్ 21, ప్రజాజ్యోతి :**

సంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) అధ్యక్షుడిగా ఖేడ్ ఎమ్మెల్యే సోదరుడు పట్లోళ్ల చంద్రశేఖర్‌రెడ్డి నియమితులైన సందర్భంగా కల్హేర్ మండలం మాసన్‌పల్లిలో కాంగ్రెస్ శ్రేణులు ఆదివారం రాత్రి సంబరాలు నిర్వహించారు. స్థానిక బస్టాండ్ కూడలిలో టపాకాయలు కాల్చి ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పరస్పరం శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. జిల్లా స్థాయిలో పార్టీ బలోపేతానికి నూతన అధ్యక్షుడి నాయకత్వం దోహదపడుతుందని వారు ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గోపాల్‌తో పాటు అనిల్, రాంచందర్‌రెడ్డి, సాయిరెడ్డి, శివ, శ్రీనివాస్, పండరి తదితరులు పాల్గొన్నారు.

# చిన్న శంకరంపేటలో స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ

# కళ్యాణ లక్ష్మిషాదీ ముబారక్ చెక్కుల కూడా పంపిణీ





**మెదక్ (ప్రజాజ్యోతి)**

మెదక్ నియోజకవర్గంలోని చిన్న శంకరంపేట మండలంలో అర్హులైన లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులతో పాటు కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాల చెక్కులను మెదక్ ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి



రోహిత్ రావు అందజేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో లబ్ధిదారులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు మాట్లాడుతూ.. ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు చేరేలా కృషి చేస్తున్నామని తెలిపారు. పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించేందుకు ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు. స్మార్ట్ రేషన్ కార్డుల ద్వారా అర్హులైన కుటుంబాలకు ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా అందే ప్రయోజనాలు మరింత సులభంగా అందుబాటులోకి వస్తాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు. రేషన్ కార్డు ప్రతి కుటుంబానికి ఆహార భద్రతతో పాటు వివిధ ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలకు ఉపయోగపడే ముఖ్యమైన పత్రంగా ఆయన వివరించారు. అదేవిధంగా కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలు పేద కుటుంబాలకు వివాహ



సమయంలో ఆర్థిక సహాయం అందిస్తూ వారికి అండగా నిలుస్తున్నాయని ఎమ్మెల్యే తెలిపారు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా పేద కుటుంబాలు ఇబ్బంది పడకుండా ప్రభుత్వం అందిస్తు"ప్రజలకు హామీలను నెరవేర్చడంతో పాటు, అర్హులైన ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు చేరేలా ప్రభుత్వం పనిచేస్తోంది. నియోజకవర్గంలో ప్రజల అవసరాలను గుర్తించి అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను సమన్వయంతో ముందుకు తీసుకెళ్తాం. పేద కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని" ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు పేర్కొన్నారు. పేద కుటుంబాలకు సంక్షేమ పథకాలే ఆర్థిక భరోసా ఎమ్మెల్యే రోహిత్ రావు కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

## మెదక్ అభివృద్ధి సంక్షేమమే ధ్యేయం: ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు

**మెదక్ (ప్రజాజ్యోతి)**

మెదక్ నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే నంబర్ వన్‌గా తీర్చిదిద్దడమే తన ఏకైక లక్ష్యమని, ఆ దిశగానే నిరంతరం శ్రమిస్తున్నామని స్థానిక ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు స్పష్టం చేశారు. సోమవారం మెదక్ పట్టణంలోని 'మాయ గార్డెన్' వేదికగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో లబ్ధిదారులకు ఆయన స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గత బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో అర్హులకు ఒక్క రేషన్ కార్డు కూడా ఇవ్వని పరిస్థితి ఉండేదని విమర్శించారు. కాంగ్రెస్ నేతృత్వంలోని 'ఇందిరమ్మ రాజ్యంలో' సంక్షేమం, అభివృద్ధి వేగంగా పరుగులు తీస్తున్నాయని, ప్రతీ పేదవానికి ప్రభుత్వ ఫలాలు అందుతున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ రాధిక, వైస్ చైర్మన్ దొంతి నరేష్ గౌడ్, ఇతర ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు మరియు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# స్పెషల్ బస్సులు నడపాలని విద్యార్థుల ధర్నా

-పాఠశాల, కళాశాల సమయాలకు అనుగుణంగా బస్సులు నడపాలని డిమాండ్





**నారాయణఖేడ్, సెప్టెంబర్ 21, ప్రజాజ్యోతి:**


పాఠశాల, కళాశాల సమయాలకు అనుగుణంగా ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడపాలని డిమాండ్ చేస్తూ విద్యార్థులు సోమవారం మనూర్ మండల పరిధిలోని బెల్లాపూర్ ఎక్స్‌రోడ్డు వద్ద రోడ్డుపై బైఠాయించి ధర్నా నిర్వహించారు. బాదల్‌గాం, బెల్లాపూర్, పుల్కుర్తి, దోసపల్లి గ్రామాలకు చెందిన పాఠశాల, కళాశాల విద్యార్థులు ఈ ఆందోళనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..నారాయణఖేడ్ నుంచి ఉదయం, సాయంత్రం వేళల్లో పుల్కుర్తి వరకు ప్రత్యేక ఆర్టీసీ బస్సులు నడపాలని విద్యార్థులు డిమాండ్ చేశారు. బస్సుల సౌకర్యం సక్రమంగా లేకపోవడంతో పాఠశాలలు, కళాశాలలకు వెళ్లేందుకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వారు తెలిపారు. ఈ సందర్భంగా ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ తమ నిరసన వ్యక్తం చేశారు. సమాచారం అందుకున్న మనూర్ ఎస్సై కోటేశ్వరరావు ఆధ్వర్యంలో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని విద్యార్థులతో మాట్లాడారు. అనంతరం ఆర్టీసీ అధికారులతో ఫోన్‌లో సంప్రదించి విద్యార్థుల సమస్యను వివరించారు. పాఠశాల, కళాశాల సమయాలకు అనుగుణంగా ప్రత్యేక బస్సు నడిపించేలా చర్యలు తీసుకుంటామని ఆర్టీసీ అధికారులు హామీ ఇవ్వడంతో విద్యార్థులు ధర్నాను విరమించారు.

# గణనాథుడి సేవలో తిరుపతిరెడ్డి

## - భక్తులకు స్వయంగా అన్నం వడ్డించిన కంఠారెడ్డి.

## - గణేష్ ఉత్సవాల సందర్భంగా మెదక్ పట్టణంలో ఆధ్యాత్మిక సందడి నెలకొంది.








**మెదక్ (ప్రజాజ్యోతి)**

గణనాథుడి దర్శనం కోసం ఏర్పాటు చేసిన మండపాలను కంఠారెడ్డి తిరుపతిరెడ్డి సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొని భక్తులకు స్వయంగా అన్నం వడ్డించారు.పట్టణంలోని మున్సిపల్ కౌన్సిలర్ మాయ గంగామణి మల్లేశం ఇంటి వద్ద ప్రతిష్ఠించిన గణనాథుడిని తిరుపతిరెడ్డి దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం జీకేఆర్ గార్డెన్ వద్ద గల గణేష్ మండలి గణనాథుని, శాంతినగర్ లోని శివశక్తి గణేష్ మండలి, ఫతేనగర్ లోని దత్త సాయి గణేష్ మండలి మండపాలకు చేరుకుని గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అన్నదానంలో భక్తులతో కలిసి పాల్గొన్న తిరుపతిరెడ్డి.. స్వయంగా భక్తులకు అన్నం వడ్డించడం ప్రత్యేకంగా ఆకట్టుకుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గణేష్ ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని సూచించారు. ఉత్సవాలు ప్రజల్లో ఐక్యత, సోదరభావాన్ని పెంపొందించేలా కొనసాగాలని ఆకాంక్షించారు.గణనాథుడి ఆశీస్సులతో మెదక్ ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆయన కోరుకున్నారు. అనంతరం గణేష్ మండలి సభ్యులు తిరుపతిరెడ్డిని శాలువాతో ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ లు బట్టి. ఉదయ్ కుమార్, జుబర్ అహ్మద్,మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మాణిక్ రెడ్డి. మాజీ ఏడుపాయల చైర్మన్ బాలా గౌడ్ మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ వెంకట్ రెడ్డి సర్పంచ్ అందే కొండల్ రెడ్డి బిఆర్ఎస్వీ నాయకులకు గంజి నవీన్,చంద్రమోహన్ గౌడ్, జగదీష్,కిరణ్ గౌడ్,నాగరాజు కిరణ్ గౌడ్,ప్రవీణ్ సాయి, రోహన్,మహేందర్ వివిధ మండపాల గణేష్ మండలి సభ్యులు,సున్నం సతీష్,గొల్ల శ్రీనివాస్,ఇప్ప నారాయణ,లోకమయిన మనోహర్,వెంకగొని సాయి గౌడ్ ,రోహన్ గౌడ్,రిత్విక్ భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# గ్రామాభివృద్ధి సమీక్షలో చర్చకు అధికారులు కరువు..

## - అభివృద్ధి ప్రణాళిక సమావేశంలో అధికారుల గైర్హాజరుపై సర్పంచుల అసంతృప్తి

**వెల్దుర్తి, సెప్టెంబర్ 21 (ప్రజాజ్యోతి):**

గ్రామాల సమగ్ర అభివృద్ధి ప్రణాళికపై నిర్వహించిన మండల స్థాయి సమీక్ష సమావేశానికి పలువురు అధికారులు గైర్హాజరు కావడంపై సర్పంచులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. అభివృద్ధి అంశాలపై కీలక సమావేశానికి అధికారులు హాజరుకాకపోవడంపై సమావేశంలోనే వారు తమ అభ్యంతరాలను వ్యక్తం చేశారు.వెల్దుర్తి ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం తెలంగాణ గ్రామ పంచాయతీ సమగ్ర అభివృద్ధి ప్రణాళిక అమలుపై సమీక్ష నిర్వహించారు. ఎంపీడీవో విగ్నేష్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో మండల రెవెన్యూ అధికారి విజయలక్ష్మి, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.గ్రామాల్లో తాగునీరు, పారిశుద్ధ్యం, అంతర్గత రహదారులు, విద్య, వైద్యం, మౌలిక వసతులు తదితర అంశాలపై ప్రణాళికలు రూపొందించి అభివృద్ధి పనులను ముందుకు తీసుకెళ్లాలని ఎంపీడీవో సూచించారు.అయితే సమీక్ష సమావేశానికి సంబంధిత అధికారులు గైర్హాజరు కావడంపై సర్పంచులు తీవ్రంగా ప్రశ్నించారు. "గ్రామాల అభివృద్ధిపై చర్చించాల్సిన సమావేశానికే అధికారులు రాకపోతే, సమస్యలను ఎవరితో చెప్పాలని, పరిష్కారాలు ఎక్కడి నుంచి వస్తాయి అంటూ వారు నిలదీశారు.అధికారుల గైర్హాజరు వల్ల గ్రామాల అభివృద్ధి ప్రణాళికల అమలుపై స్పష్టత లేకుండా పోతోందని సర్పంచులు ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశాలను తూతూమంత్రంగా నిర్వహించకుండా, సంబంధిత శాఖల అధికారులు తప్పనిసరిగా హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు.గత నెలలో నిర్వహించిన సమీక్ష సమావేశానికి కూడా పలువురు అధికారులు హాజరు కాలేదని, తాజాగా సోమవారం జరిగిన సమావేశానికి సైతం అదే పరిస్థితి కొనసాగడంపై సర్పంచులు ఆవేదన వ్యక్తం చేశారు.అదేవిధంగా గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం నుంచి నిధులు విడుదల కావడం లేదని పలువురు సర్పంచులు అసంతృప్తి వ్యక్తం చేశారు. నిధుల కొరతతో అభివృద్ధి పనులు ముందుకు సాగడం లేదని తెలిపారు.సమీక్ష సమావేశానికి గైర్హాజరైన అధికారులపై ఉన్నతాధికారులు విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని సర్పంచులు డిమాండ్ చేశారు. ఇకపై గ్రామాభివృద్ధికి సంబంధించిన సమావేశాలకు సంబంధిత అధికారులు తప్పనిసరిగా హాజరయ్యేలా స్పష్టమైన ఆదేశాలు జారీ చేయాలని కోరారు.సమావేశంలో పలువురు




సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

# యుక్తితో.. నేర్పుగా వ్యవహరించాలి

## - భారత్‌పశ్చిమాసియా సంబంధాలపై కల్నల్ రాజీవ్ అగర్వాల్









**పటాన్‌చెరు(ప్రజాజ్యోతి)**

పశ్చిమాసియాతో భారతదేశానికి ఉన్న అనుబంధం చారిత్రకమైనదని, మారుతున్న భౌగోళిక రాజకీయ పరిస్థితుల్లో ఈ సంబంధాలను యుక్తితో, నేర్పుగా కొనసాగించాల్సిన అవసరం ఉందని చింతన్ రీసెర్చ్ ఫౌండేషన్ సీనియర్ రీసెర్చ్ కన్సల్టెంట్, రిటైర్డ్ కల్నల్ రాజీవ్ అగర్వాల్ అన్నారు. గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలోని కౌటిల్య స్కూల్ ఆఫ్ పబ్లిక్ పాలసీ (కేఎస్‌పీపీ)లో 'ప్రాంతీయ సంఘర్షణ, విచ్ఛిన్నత నేపథ్యంలో భారతపశ్చిమాసియా విధానాన్ని పునఃసమీక్షించడం'పై ఆతిథ్య ఉపన్యాసం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇంధనం, వాణిజ్యం, పెట్టుబడులు, రక్షణ, భద్రత, అనుసంధానం, ప్రజల మధ్య సంబంధాలు వంటి అనేక రంగాల్లో భారత్‌పశ్చిమాసియా బంధం విస్తరిస్తోందన్నారు. నిఘా సమాచార మార్పిడి, సైబర్ భద్రత, అంతరిక్షం, డ్రోన్ లు, సముద్ర భద్రత రంగాల్లోనూ సహకారం పెరుగుతోందని వివరించారు. హోర్ముజ్ జలసంధి ప్రాధాన్యతను ప్రస్తావిస్తూ.. ప్రపంచ ఇంధన సరఫరాలో కీలకమైన ఈ మార్గం భారత్‌కు వ్యూహాత్మకంగా ముఖ్యమన్నారు. భారత ప్రవాసులు, నావికుల ప్రయోజనాల పరిరక్షణతో పాటు ఇంధన భద్రతపై దృష్టి పెట్టాలని సూచించారు. ముగింపులో భద్రత, మానవత, మౌలిక సదుపాయాలు, అనుసంధానం, ఇంధన భద్రత, వాణిజ్యం, పెట్టుబడులు, దౌత్యం, వ్యూహాత్మక స్వయం ప్రతిపత్తి అంశాలతో కూడిన 'షీల్డ్' ఫ్రేమ్‌వర్క్‌ను ప్రతిపాదించారు. కార్యక్రమంలో కేఎస్‌పీపీ డీన్, మాజీ దౌత్యవేత్త సయ్యద్ అక్బరుద్దీన్ పాల్గొన్నారు.

### గీతంలో పోషకాహార వారోత్సవాలు

#### ఆహార సాంకేతికతపై విద్యార్థుల సృజనాత్మక ప్రదర్శనలు

గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ ఆధ్వర్యంలో 'ఫుడ్ టెక్నో ఫెస్ట్2026'తో జాతీయ పోషకాహార వారోత్సవాలు నిర్వహించారు. సీఎస్ఐఆర్‌సీఎఫ్‌టీఆర్ఐ మాజీ డైరెక్టర్ డాక్టర్ శ్రీదేవి అన్నపూర్ణ సింగ్ ఆహార శుద్ధి, సమతుల్య పోషకాహారం, ప్రత్యామ్నాయ ప్రోటీన్ లు ఆహార నష్టాన్ని తగ్గించే సాంకేతికతలపై వివరించారు. టెక్నికల్ డైరెక్టర్ దేబాశిష్ మొహంతి వినియోగదారుల అభిరుచులకు అనుగుణంగా ఆహార ఉత్పత్తుల రూపకల్పనపై ప్రసంగించారు. విద్యార్థులు పోస్టర్ ప్రజెంటేషన్లు, నమూనాలు, వినూత్న ఆహార ఉత్పత్తుల పోటీల్లో పాల్గొన్నారు. కార్యక్రమాన్ని డాక్టర్ జి. నిహారిక, డాక్టర్ ఎం. సురేంద్రబాబు సమన్వయంతో నిర్వహించారు.

# ఉపాధ్యాయుడికి జెట్ వినూత్న ఉపాధ్యాయ అవార్డు

**జిన్నారం(ప్రజాజ్యోతి)**

జిన్నారం మున్సిపల్ పరిధిలోని మంగంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల జీవశాస్త్ర ఉపాధ్యాయుడు దావునూరి చంద్రశేఖర్ కు 2026 సంవత్సరానికి జెట్ వినూత్న ఉపాధ్యాయ అవార్డు లభించింది. విద్యార్థులకు కృత్యాధార, అనుభవపూర్వక బోధన అందిస్తూ, వినూత్న బోధనాభ్యసన సామగ్రితో అభ్యసనపై ఆసక్తిని పెంపొంది స్తున్నందుకు ఈ పురస్కారం దక్కింది. సోమవారం నగరంలోని సికింద్రాబాద్ హరిహర కళాభవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఉపాధ్యాయ శాసనమండలి సభ్యుడు పింగిళి శ్రీపాల్ రెడ్డి, విశ్రాంత ఐఏఎస్ అధికారి దినకర్ బాబు, నమూనా పాఠశాలల అదనపు సంచాలకుడు శ్రీనివాస్ తదితరుల చేతుల మీదుగా చంద్రశేఖర్ అవార్డును స్వీకరించారు. అవార్డును అందుకోవడం పై ఉపాధ్యాయుడు చంద్రశేఖర్ సంతోషం వ్యక్తం చేస్తూ కమిటీ సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు.




# సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన

**జిన్నారం(ప్రజాజ్యోతి)**

జిన్నారం మున్సిపాలిటీ కేంద్రం 18 వ వార్డులో సిసి రోడ్లకు వార్డు కౌన్సిలర్ ఎర్రవల్లి దీన ప్రవీణ్ కాలనీవాసులతో కలిసి కొబ్బరికాయలు కొట్టి పనులు ప్రారంభించారు,ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా కాలనీలో రోడ్డు సమస్య నెలకొని ఉన్నదని ఎన్నికల సమయంలో ఇచ్చిన మాట ప్రకారం కాలనీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని తెలిపారు,సిసి రోడ్ల నిర్మాణ పనులను నాణ్యత ప్రమాణాలతో పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామని తెలిపారు ఈ కార్యక్రమంలో నీలం నర్సింలు,జింకల శివరాజ్ ,అంజిరెడ్డి శ్రీనివాస్ గౌడ్, మేదరి అనిల్ ,మహేష్ గౌడ్ విజయ్ ,భాస్కర్,విక్కీ తదితరులు పాల్గొన్నారు.





# 53వ సారి రక్తదానం చేసి ఔదార్యం చాటుకున్న ఓంప్రకాష్

**నారాయణఖేడ్, సెప్టెంబర్ 21, ప్రజాజ్యోతి:**

సంగారెడ్డి జిల్లా కేంద్రంలోని శ్రీ బాలాజీ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఓ వ్యక్తికి ఓ నెగటివ్ రక్తం అవసరమని తెలుసుకున్న ప్రముఖ సామాజిక సేవకుడు ఓంప్రకాష్ స్పందించి 53వ సారి రక్తదానం చేసి తన ఔదార్యాన్ని చాటుకున్నారు. నాగల్‌గిద్ద మండలం ఉట్పల్లి గ్రామానికి చెందిన ఓంప్రకాష్ ప్రతి మూడు నెలలకు ఒకసారి రక్తదానం చేయడాన్ని తన బాధ్యతగా భావిస్తున్నానని తెలిపారు. మానవ సేవే మాధవ సేవ అనే సిద్ధాంతంతో రక్తదానం చేస్తున్నట్లు పేర్కొన్నారు. రక్తదానం చేయడంతో పాటు రక్తదాన శిబిరాల ఏర్పాటుకు కూడా ఓంప్రకాష్ చేస్తున్న కృషి అభినందనీయమని పలువురు ప్రశంసించారు. అత్యవసర సమయంలో రక్తం అవసరమైన వారికి తన వంతు సహాయం అందిస్తూ సమాజ సేవలో ముందుండటం స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. సామాజిక సేవ, రక్తదాన రంగంలో ఓంప్రకాష్ చేస్తున్న సేవలను గుర్తించి ఆయనకు డాక్టరేట్ గౌరవం కూడా లభించింది. అలాగే ఆయన తెలంగాణ రాష్ట్ర ఉత్తమ రక్తదాత అవార్డు గ్రహీతగా గుర్తింపు పొందారు. ఇండియన్ నేషనల్ హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ రాష్ట్ర నాయకుడిగా సేవలు అందిస్తూ రక్తదానంపై అవగాహన కల్పిస్తున్నారు. మరింత మంది రక్తదానం చేసేందుకు ప్రోత్సహిస్తూ చేస్తున్న ఆయన సేవలను పలువురు అభినందించారు.



# ప్రజావాణి దరఖాస్తులను సత్వరంగా పరిష్కరించాలి

## - ప్రతి వినతిపై క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి సత్వర చర్యలు తీసుకోవాలి :

## - అడిషనల్ కలెక్టర్లు సంగీత, పాండు









సంగారెడ్డి ప్రజా జ్యోతి ప్రతినిధి:-

ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి అందిన ప్రతి దరఖాస్తును క్షేత్రస్థాయిలో సమగ్రంగా పరిశీలించి, అర్హత మేరకు వేగవంతంగా పరిష్కరించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని అడిషనల్ కలెక్టర్లు ఆదేశించారు.సోమవారం కలెక్టరేట్ గ్రీవెన్స్ హాల్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు సంగీత, పాండు లు ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. కార్యక్రమానికి హాజరైన అర్జీదారుల సమస్యలను ఆలకిస్తూ, ప్రతి దరఖాస్తును పరిశీలించి సంబంధిత శాఖల అధికారులకు పంపిస్తూ తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రజల సమస్యల పరిష్కారంలో జాప్యానికి తావులేకుండా ప్రతి ఫిర్యాదుకు సత్వర పరిష్కారం అందించాలని తెలిపారు.ప్రజావాణిలో మొత్తం 79 వినతులు అందినట్లు అధికారులు తెలిపారు. వాటిలో సంగారెడ్డి డివిజన్‌కు 20, నారాయణఖేడ్ డివిజన్‌కు 2, జహీరాబాద్ డివిజన్‌కు 2, కలెక్టరేట్‌కు 55 దరఖాస్తులు అందగా, అందోల్ డివిజన్‌కు ఎలాంటి వినతులు అందలేదని వెల్లడించారు.ప్రజావాణిలో ప్రధానంగా రెవిన్యూ, హౌసింగ్, పెన్షన్లు, పంచాయతీరాజ్, ఎంప్లాయిమెంట్, ఆర్టీసీ, ఎలక్ట్రిసిటీ, ఇరిగేషన్, మిషన్ భగీరథ గ్రిడ్, యూత్ వెల్ఫేర్, కోపరేటివ్, లేబర్, అగ్రికల్చర్, విద్య, వైద్య ఆరోగ్య శాఖ, డి ఆర్ డి ఓ, సర్వే ల్యాండ్ రికార్డ్స్, పోలీస్, ట్రైబల్ వెల్ఫేర్, మహిళా ,శిశు, వికలాంగులు వయోవృద్ధుల సంక్షేమ శాఖ, ఈ ఈ పి ఆర్, ఎక్సైజ్, మున్సిపల్ తదితర శాఖలకు సంబంధించిన ఫిర్యాదులు, వినతులు అందాయి.ఈ కార్యక్రమంలో జిల్లా స్థాయి వివిధ శాఖల అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, ప్రజలు పాల్గొన్నారు.

---

# టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన నూతన డీసీసీ అధ్యక్షుడు చంద్రశేఖర్ రెడ్డి,నారాయణ్ ఖేడ్ ఎమ్మెల్యే సంజీవ్ రెడ్డి

## చంద్రశేఖర్ రెడ్డిని ఘనంగా సన్మానించిన టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి

సంగారెడ్డి ప్రజా జ్యోతి ప్రతినిధి :

సంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన చంద్రశేఖర్ రెడ్డి, నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డితో కలిసి టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డిని సంగారెడ్డి పట్టణంలోని రామ్‌నగర్ రామ్ మందిర్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నూతన డీసీసీ అధ్యక్షుడు చంద్రశేఖర్ రెడ్డిని జగ్గారెడ్డి ఘనంగా సన్మానించి అభినందించారు.ఈ సందర్భంగా జగ్గారెడ్డి మాట్లాడుతూ.. నిర్మలా జగ్గారెడ్డి డీసీసీ అధ్యక్షురాలిగా ఏడు సంవత్సరాలకు పైగా సుదీర్ఘకాలం పనిచేశారని తెలిపారు. ఆమె హయాంలో జిల్లా కేంద్రంలో ఏ విధంగా పార్టీ కార్యక్రమాలను నిర్వహించామో, అంతకంటే ఎక్కువగా చంద్రశేఖర్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ కార్యక్రమాలను నిర్వహిస్తామని చెప్పారు. చంద్రశేఖర్ రెడ్డికి తన పూర్తి సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు.సోనియాగాంధీ, రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ ఆదేశాలకు అనుగుణంగా పార్టీ అభివృద్ధి కోసం కృషి చేయాలని జగ్గారెడ్డి సూచించారు. జిల్లాలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు నాయకులు, కార్యకర్తలతో సమన్వయంతో ముందుకు సాగాలని అన్నారు.

### సహకరించిన నాయకులకు కృతజ్ఞతలు: చంద్రశేఖర్ రెడ్డి



నూతన డీసీసీ అధ్యక్షుడు చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ.. తనను డీసీసీ అధ్యక్షుడిగా ఎంపిక చేయడంలో సహకరించిన మంత్రి దామోదర్ రాజనర్సింహ, ఇన్‌చార్జి మంత్రి వివేక్ వెంకటస్వామి, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు.నిర్మలా జగ్గారెడ్డి అడుగుజాడల్లో నడుస్తూ, ఆమె మాదిరిగానే అందరితో సమన్వయం చేసుకుంటూ పార్టీ కోసం పనిచేస్తానని చెప్పారు. జిల్లాలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు.



### అధిష్టానానికి కృతజ్ఞతలు: ఎమ్మెల్యే సంజీవరెడ్డి

నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి మాట్లాడుతూ.. తన తమ్ముడు చంద్రశేఖర్ రెడ్డిపై నమ్మకంతో డీసీసీ అధ్యక్షుడిగా నియమించిన ఏఐసీసీ అధిష్టానానికి కృతజ్ఞతలు తెలిపారు. అలాగే చంద్రశేఖర్ రెడ్డి ఎంపికకు సహకరించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి దామోదర్ రాజనర్సింహ, జగ్గారెడ్డిలకు ధన్యవాదాలు తెలిపారు. జిల్లా కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి అందరి సహకారంతో ముందుకు సాగుతామని పేర్కొన్నారు.

# టీ స్టాల్ నుంచి టిఫిన్ సెంటర్ దాకా అనిల్ కష్టానికి కొత్త చిరునామా

మెదక్ (ప్రజాజ్యోతి)

**'అనిల్ టిఫిన్ సెంటర్'ను ప్రారంభించిన మున్సిపల్ చైర్‌పర్సన్ రాధిక భూపతిరాజ్ కష్టాన్నే పెట్టుబడిగా మార్చుకున్న యువకుడికి పలువురి అభినందనలు నాణ్యతా ప్రమాణాలతో రుచికరమైన అల్పాహారం అందించాలని ఆకాంక్ష**

చిన్న టీ స్టాల్‌తో మొదలైన జీవన ప్రయాణం... కష్టాన్ని నమ్ముకుని ఒక్కో అడుగు ముందుకు వేసి నేడు సొంతంగా 'అనిల్ టిఫిన్ సెంటర్' ఏర్పాటు చేసుకునే స్థాయికి చేరింది. స్వయం ఉపాధి బాటలో ముందుకు సాగుతున్న అనిల్ జీవితంలో సోమవారం మరో కొత్త అధ్యాయం ప్రారంభమైంది.మెదక్ పట్టణంలో కొత్తగా ఏర్పాటు చేసిన 'అనిల్ టిఫిన్ సెంటర్'ను మున్సిపల్ చైర్‌పర్సన్ రాధిక భూపతిరాజ్ ముఖ్య అతిథిగా హాజరై, రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. అనంతరం నిర్వాహకుడు అనిల్‌కు ఆమె హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా చైర్‌పర్సన్ రాధిక భూపతిరాజ్ మాట్లాడుతూ.. వినియోగదారులకు పరిశుభ్రతతో పాటు నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ రుచికరమైన అల్పాహారాన్ని అందించాలని ఆకాంక్షించారు. వ్యాపారంలో నాణ్యతే కీలకమని, ప్రజల ఆదరణను సంపాదించుకుని అనిల్ మరింతగా ఎదగాలని కోరారు.

**యువతకు స్ఫూర్తిగా అనిల్ ప్రయాణం**



చిన్న ఉపాధితో మొదలై.. సొంత వ్యాపారం వైపు సాగిన అనిల్ ప్రయాణం నేటి యువతకు ఎంతో స్ఫూర్తిదాయకమని పలువురు కొనియాడారు. టీ స్టాల్‌లో వినియోగదారులను ఆత్మీయంగా పలకరిస్తూ, కష్టాన్ని నమ్ముకుని జీవనం సాగించిన అనిల్ ఇప్పుడు టిఫిన్ సెంటర్‌తో మరో అడుగు ముందుకు వేశారు. చేసే పని చిన్నదా, పెద్దదా అన్నది ముఖ్యం కాదు.. ఆత్మగౌరవంతో కష్టపడి ఎదగాలనే సంకల్పమే విజయానికి తొలి మెట్టు అని అనిల్ జీవితం నిరూపించిందని ప్రశంసించారు.ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో కౌన్సిలర్లు సంపత్, ఆవారి రాజశేఖర్, ఆంజనేయులు, కాంగ్రెస్ నాయకులు భూపతిరాజ్, జోజి, పలువురు సర్పంచులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# గర్భిణీ, బాలెంతలకు పోషణ మాసం పట్ల అవగాహన కార్యక్రమం

వట్టిపల్లిప్రజా జ్యోతి సెప్టెంబర్ 21

వట్పల్లి మండలం , మేడికుంద గ్రామం లోని అంగన్వాడి 209, 210 సెంటర్లలో నేడు గర్భిణీ, బాలెంతలకు పోషణమాసం యొక్క ప్రాధాన్యత పట్ల అంగన్వాడి టీచర్లైన మాదేవి , అంజనబాయి వివరించారు. సమతులాహారం వలన ప్రోటీన్ , ఇనుము , కాల్సియం, పోలిక్ యాసిడ్ , ఒమేగా -3 ఫ్యాటి యాసిడ్ మూలానా " రక్త హీనత " నివారించవచ్చు. దీంతో నెలలు నిండ కుండా పుట్టడం, ప్రీ క్లాంప్సియా ప్రమాధాన్ని తగ్గించవచ్చును. ఆకు కూరలు, పండ్ల లో ఫైబర్ పీచు పదార్థం ఉండుటచే మలబద్ధకం కానిస్టిపేషన్ సమస్యను దూరం చేసి, కంటి చూపు మరియు ఎముకల ఆరోగ్యం కాపాడునని తల్లులకు తెలియ పరచారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు సాయికృష్ణ, ఆయా పోచమ్మ , ఆషా వర్కర్ స్వరూప , తల్లులు, పిల్లలు పాల్గొన్నారు.



# విద్యార్థులు హక్కులు, బాధ్యతలపై అవగాహన కలిగి ఉండాలి

## - సీనియర్ సివిల్ జడ్జి బి. సౌజన్య









నారాయణఖేడ్, సెప్టెంబర్ 21, ప్రజాజ్యోతి:

విద్యార్థులు తమ హక్కులు, బాధ్యతలు, చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి బి. సౌజన్య సూచించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, సంగారెడ్డి ఆధ్వర్యంలో సోమవారం నారాయణఖేడ్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన న్యాయ అవగాహన కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు..భారత రాజ్యాంగం, ప్రాథమిక హక్కులు, బాలల హక్కులు, మహిళల రక్షణ చట్టాలు, సైబర్ నేరాలు, మాదకద్రవ్యాల దుర్వినియోగం, రోడ్డు భద్రత తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. సోషల్ మీడియా, ఇంటర్నెట్‌ను బాధ్యతాయుతంగా వినియోగించాలని సూచించారు. తెలియని వ్యక్తులతో వ్యక్తిగత వివరాలు, ఓటీపీలు, పాస్‌వర్డ్‌లు, బ్యాంకింగ్ సమాచారాన్ని పంచుకోవద్దని తెలిపారు. సైబర్ నేరాలకు గురైనప్పుడు వెంటనే సంబంధిత అధికారులను సంప్రదించాలని సూచించారు. బాల్య వివాహాలు, బాల కార్మిక వ్యవస్థ వంటి సామాజిక సమస్యలను అరికట్టడంలో విద్యార్థులు తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని కోరారు. మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటూ ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని సూచించారు. ఆర్థిక పరిస్థితుల కారణంగా ఎవరూ న్యాయ సేవలకు దూరం కాకూడదని, అర్హులైన వారికి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ద్వారా ఉచిత న్యాయ సహాయం, న్యాయ సలహా అందుబాటులో ఉంటాయని వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్, నారాయణఖేడ్ కోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మారుతి రెడ్డి, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# నూతన సీసీ రోడ్డును ప్రారంభించిన

## - ఎమ్మెల్యే సంజీవరెడ్డి

నారాయణఖేడ్, సెప్టెంబర్ 21, ప్రజాజ్యోతి:

గ్రామీణ రహదారుల అభివృద్ధితో ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని నారాయణఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి అన్నారు. నారాయణఖేడ్ మండల పరిధిలోని లింగాపూర్ గ్రామపంచాయతీ పరిధి చందాపూర్ గ్రామంలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ఎంజీఎన్ఆర్ఈజీఎస్ కింద రూ.5 లక్షల నిధులతో నిర్మించిన నూతన సీసీ రోడ్డును సోమవారం ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..ప్రతి గ్రామంలో అంతర్గత రహదారులు, మురుగు కాలువలు, తాగునీటి సౌకర్యాల కల్పనకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతులను మెరుగుపరిచేందుకు కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని హామీ ఇచ్చారు. ఈకార్యక్రమంలో గ్రామ సర్పంచ్ రుక్మిణి హనుమాండ్లు, నాయకులు పండరి రెడ్డి, సుబుర్, నాగనాథ్ రెడ్డి, అశోక్ రెడ్డి, రమేష్ రెడ్డి, వార్డు సభ్యుడు నర్సింలు, పంచాయతీ కార్యదర్శి శంకర్, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.






ప్రజాజ్యోతి
మంగళవారం 22 సెప్టెంబర్ 2026

# బొల్లారంలో ఇద్దరు బాలురు అదృశ్యం

## - ఒకరు 12 ఏళ్ల సందీప్.. మరొకరు 10 ఏళ్ల అన్మోల్





**జిన్నారం(ప్రజాజ్యోతి)**

ఐడీఏ బొల్లారం పోలీస్‌స్టేషన్ పరిధిలో ఇద్దరు బాలురు అదృశ్యమైన ఘటనలు ఆందోళనకు గురిచేస్తున్నాయి. వేర్వేరు ప్రాంతాలకు చెందిన ఇద్దరు బాలురు కనిపించకుండా పోవడంతో కుటుంబ సభ్యులు పోలీసులను ఆశ్రయించారు.బొల్లారం బాలాజీనగర్‌కు చెందిన జితేంద్రకుమార్ బర్మా కుమారుడు సందీప్‌కుమార్ (12) ఈ నెల 20న అదృశ్యమయ్యాడు. సందీప్ బొల్లారం పబ్లిక్ స్కూల్‌లో నాలుగ వ తరగతి చదువుతున్నాడు. మధ్యాహ్నం 2 గంటల సమయంలో ఇంట్లోనే ఉన్న బాలుడు.. తండ్రి సాయంత్రం 5 గంటలకు విధులు ముగించుకుని ఇంటికి వచ్చే సరికి కనిపించలేదు. కుటుంబ సభ్యులు బంధువులు, స్నేహితులు, తెలిసిన ప్రదేశాల్లో వెతికినా ఆచూకీ లభించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. సందీప్ హిందీ మాట్లాడుతాడని, అదృశ్యమైన సమయంలో గులాబీ రంగు చొక్కా, జీన్స్ ప్యాంటు ధరించి ఉన్నట్లు తెలిపారు.మరో ఘటనలో ఖాజీపల్లి జీఎంఆర్ కాలనీకి చెందిన 10 ఏళ్ల అన్మోల్ అదృశ్యమయ్యాడు. బాలుడి తల్లి రింకుదేవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. తల్లి పనికి వెళ్లిన సమయంలో ఇంట్లో ఉన్న బాలుడు కనిపించకుండా పోయాడు. ఎనిమిది రోజులుగా బంధువులు, స్నేహితులు, పరిసర ప్రాంతాల్లో గాలించినా ఆచూకీ లభించలేదు. బాలుడు మానసికంగా అస్థిరంగా ఉన్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. గతంలో రెండుసార్లు ఇంటి నుంచి వెళ్లి తిరిగి వచ్చినట్లు పేర్కొన్నారు. అదృశ్యమైన సమయంలో తెల్లటి చొక్కా, షార్ట్ ధరించి ఉన్నాడు.ఇద్దరు బాలుర ఆచూకీ తెలిసిన వారు వెంటనే ఐడీఏ బొల్లారం పోలీస్‌స్టేషన్‌ను సంప్రదించాలని పోలీసులు కోరారు.

# శ్రీ విఘ్నేశ్వర సన్నిధిలో ప్రముఖుల ప్రత్యేక పూజలు





**కల్హేర్, సెప్టెంబర్ 21, ప్రజాజ్యోతి:**

సంగారెడ్డి జిల్లాలోని కల్హేర్ మండల కేంద్రంతో పాటు మండలంలోని వివిధ గ్రామాల్లో వినాయక నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. విఘ్నేశ్వర మండపాల్లో ఏర్పాటు చేసిన గణనాథుడి విగ్రహాలు వివిధ రూపాల్లో భక్తులను ఆకట్టుకుంటున్నాయి.ఈ సందర్భంగా మండలానికి చెందిన పలువురు ప్రముఖులు వినాయకుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు, పునస్కారాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ చేపట్టారు. కీర్తనలు, భజనలతో మండపాల వద్ద ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.కల్హేర్ మండలంలోని కృష్ణాపూర్ గ్రామంలో సర్పంచ్ శశికళ తుకారాం, వార్డు సభ్యులు ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అలాగే ఇంద్రానగర్ గ్రామంలో సర్పంచ్ ఉప్పరి సంగన్నతో పాటు వార్డు సభ్యులు గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండలానికి చెందిన సీనియర్ అయ్యప్ప గురుస్వామి తడుగూరి సంగన్న ఆధ్వర్యంలో శ్రీరామ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ విఘ్నేశ్వరుడి ఆశీస్సులతో ప్రజల సకల విఘ్నాలు తొలగిపోయి, ప్రతి కుటుంబంలో పిల్లాపాపలు సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. మండలంలో మంచి పాడి పంటలు పండి, ప్రజలు సుఖశాంతులతో, ఆయురారోగ్యాలతో చల్లగా ఉండాలని గణనాథుడిని ప్రార్థించినట్లు తెలిపారు.



# ఇంటింటికీ వెళ్లి ఆసరా పింఛన్ లబ్ధిదారుల వివరాల పరిశీలన

## - అర్హులందరికీ పింఛన్లు అందేలా చర్యలు

## -కౌన్సిలర్ షారుఖ్ ఖాన్



**నారాయణఖేడ్, సెప్టెంబర్ 21, ప్రజాజ్యోతి:**

నారాయణఖేడ్ మున్సిపాలిటీ పరిధిలోని ఆయా వార్డుల్లో ఆసరా పింఛన్ లబ్ధిదారుల వివరాలను మున్సిపల్ వార్డు అధికారి పండరి పరిశీలించారు. సోమవారం 12వ వార్డు కౌన్సిలర్ షారుఖ్ ఖాన్ ఆధ్వర్యంలో సిబ్బంది వార్డులో ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారుల ధ్రువీకరణ పత్రాలను పరిశీలించి వివరాలు నమోదు చేసుకున్నారు. ఈ సందర్భంగా వార్డు అధికారి పండరి మాట్లాడుతూ.. మున్సిపల్ కమిషనర్ వి. ప్రశాంతి ఆదేశాల మేరకు పట్టణంలోని అన్ని వార్డుల్లో ఆసరా పింఛన్ లబ్ధిదారుల వివరాలను పరిశీలిస్తున్నట్లు తెలిపారు. అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం పింఛన్లు అందేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. పరిశీలనకు వచ్చే సిబ్బందికి లబ్ధిదారులు అవసరమైన వివరాలు, ధ్రువపత్రాలను అందించి సహకరించాలని కోరారు. ఈ సందర్భంగా వితంతువులు, ఒంటరి మహిళలు, దివ్యాంగుల పింఛన్లకు సంబంధించిన అర్హతలను పరిశీలించి, అవసరమైన వివరాలను నమోదు చేసుకున్నట్లు తెలిపారు. లబ్ధిదారుల ఆధార్‌తో పాటు ఇతర సంబంధిత ధ్రువపత్రాలను కూడా పరిశీలించినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగాకౌన్సిలర్ షారుఖ్ ఖాన్ మాట్లాడుతూ.. అర్హత ఉన్న ప్రతి లబ్ధిదారుడికి ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందేలా కృషి చేస్తున్నామని తెలిపారు. పింఛన్ల పరిశీలన ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించి, అర్హులైన వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని అధికారులను కోరారు.

## తీరిన లో-వోల్టేజీ సమస్య

### -ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు..

### - మున్సిపల్, విద్యుత్ అధికారులకు కృతజ్ఞతలు

**జిన్నారం(ప్రజాజ్యోతి)**

గడ్డపోతారం మున్సిపాలిటీ పరిధిలోని మాదారం గ్రామం గడ్డమీదిబస్తీలో గత ఏడాది నుంచి నెలకొన్న లో-వోల్టేజీ సమస్యకు పరిష్కారం లభించింది. మున్సిపల్ వైస్‌చైర్మన్ మహేందర్‌గౌడ్ ఆధ్వర్యంలో విద్యుత్ అధికారులు బుధవారం నూతన ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారు. దీంతో బస్తీవాసుల విద్యుత్ కష్టాలు తొలగ నున్నాయి. గత కొంతకాలంగా తక్కువ వోల్టేజీతో ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన వైస్‌చైర్మన్ మహేందర్‌గౌడ్ విద్యుత్ అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టారు. ఈ మేరకు ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేయడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. సమస్య పరిష్కారానికి కృషి చేసిన మున్సిపల్, విద్యుత్ అధికారులకు వారు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్ లు మల్లేష్ ముదిరాజ్, స్వాతి, గణేష్‌సింగ్, నవీన్, బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షుడు గణేష్, సాకేత్, లైన్‌మన్ అశోక్, కుమ్మరి మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.



## హనుమాన్ మందిరంలో గణపతి మహా ప్రసాద వితరణ

**కల్హేర్. 21.సెప్టెంబర్. ప్రజా జ్యోతి.**

హనుమాన్ మందిరం వద్ద రుద్రసేన యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గణపతి ఉత్సవాల్లో భాగంగా భక్తులకు మహా ప్రసాద వితరణ కార్యక్రమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి భక్తులు, స్థానికులు పెద్ద సంఖ్యలో హాజరై ప్రసాదాన్ని స్వీకరించారు. మహా ప్రసాద వితరణ కార్యక్రమానికి ముదాళం వీరశేటి కుటుంబ సభ్యులు పూర్తి సహకారం అందించారు. ఈ సందర్భంగా వీర్‌శెట్టి, శశిరేఖ, భరత్, స్పందన, భార్గవ్ రాజ్, రూపశ్రీ, మణికర్ణిక, రుద్రిక తదితర కుటుంబ సభ్యులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. రుద్రసేన యూత్ సభ్యులు మాట్లాడుతూ గణపతి ఉత్సవాల సందర్భంగా భక్తులకు ప్రసాద వితరణ చేపట్టడం ఆనందంగా ఉందని తెలిపారు. కార్యక్రమం ప్రశాంతంగా, భక్తి వాతావరణంలో కొనసాగింది.



## వికలాం గు ల ధ్రువీకరణ పత్రంపై పరిశీలన . అధికారి వినయ్ కుమార్

**కల్హేర్, సెప్టెంబర్ 21, ప్రజాజ్యోతి:**

సంగారెడ్డి జిల్లాలోని కల్హేర్ మండల కేంద్రానికి చెందిన కట్టెల రాజు వికలాంగత్వ ధ్రువీకరణ పత్రం పరిశీలనలో భాగంగా అధికారులు సోమవారం ఆయన నివాసానికి వెళ్లి విచారణ చేపట్టారు. కల్హే ర్ సర్పంచ్ కోడి గంగారం, ఉపసర్పంచ్ పి. మహేష్, పంచాయతీ కార్యదర్శి కృష్ణచారి, వార్డు సభ్యుడు పిట్ల శంకర్ ఆధ్వర్యంలో ఈ పరిశీలన జరిగింది. వికలాంగుల ధ్రువీకరణ పత్రం విచారణ అధికారి ఏఈ వినయ్‌కుమార్ కట్టెల రాజు పరిస్థితిని పరిశీలించి వివరాలను నమోదు చేశారు. పరిశీలన అనంతరం సంబంధిత వివరాలపై సంతృప్తి వ్యక్తం చేసిన ఏఈ వినయ్‌కుమార్, అర్హతను బట్టి ప్రభుత్వం ద్వారా అనువైన వికలాంగత్వ ధ్రువీకరణ పత్రం అందేలా అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

